<u>ఓంశ్రీసాయిరాం</u>

జిహ్వాగ్రే వర్తతే లక్ష్మీః జిహ్వాగ్రే మిత్రబాంధవాః ।
జిహ్వాగ్రే బంధన ప్రాప్తి జిహ్వాగ్రే మరణం ధ్రువమ్॥

ప్రేమస్వరూపులారా!

మానవుని సమస్త సంపదలకు మూలకారణము వాక్కు. తన బంధనములకు వాక్కు మూలకారణము. ప్రతి మానవుని బంధమునకు, అనుబంధమునకు, మోక్షమునకు, మృత్యువునకు వాక్కు మూలకారణము. జిహ్వను యెంతయో మనము అదుపులో ఉంచుకోవాలి. జిహ్వను ఎట్టి పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టామో మన కీర్తి, అపకీర్తి దానిననుసరించే ఉంటాయి. మన స్నేహము, మన బంధుత్వము జిహ్వయొక్క పలుకులపైనే ఆధారపడి ఉంటుంది. ఈ సమస్త శక్తులన్నీ మూడు కర్మలపై ఆధారపడి ఉంటున్నాయి. అవే సృష్టి, స్థితి, లయము. ఈ మూడింటి ఆధారము చేతనే ఈ జగత్తు నడవ గలుగుతున్నానది. ఈ కర్మలు ఆధారముగా ఉండినప్పుడు కర్మకు ఒక కర్త ఉండాలికదా. కర్తలేని కర్మ జగత్తులో కానరాదు. కనుక, కర్త, కర్మ ఈ రెండింటి అనుబంధము ఫలితమునకు మూల కారణము. కర్త ఎవరు? కర్మ ఏమిటి? ఫలము ఏమిటి? ఈ మూడు విషయములను మనము చక్కగా గుర్తిచినప్పుడే సృష్టి రహస్యము మనకు అర్థమవుతుంది.

భగవంతిని లీలలు విమర్శించటము సులభము. కాని, అవగాహన చేసుకోటం అత్యంత కష్టము. కనుక, మనము అవగాహన చేసుకొనే విషయములో మన జీవితమును అంకితము గావించాలి. ఇందులో మొట్టమొదటిది సృష్టి. మానవత్వములో ఒకవిధమైన నిబంధనలుంటున్నవి. ఒక వంతెన కట్టవలెనన్న దీనికి అనేకమంది ఆధారమై ఉంటున్నారు. ఒక ఛీఫ్ ఇంజనీరుండాలి. జూనియర్ ఇంజనీరుండాలి. సూపర్‌వైజరుండాలి. ఇంకా యితరులు ఉండాలి. ఇంతమంది చేరినప్పుడే ఈ వంతెన నిర్మించటానికి వీలవుతుంది. సృష్టి, స్థితి, లయములకు మూడు ప్రధానులుంటున్నారు. ఒక చిన్న రాష్ట్రమును పాలించవలెనన్న 30,40 మినిష్టర్సు నియమింపబడతారు. ఒక చిన్న రాష్ట్రమును పాలించవలెనంటే యింతమంది పాలకులుండినప్పుడు యింత విశాలమైన సృష్టిని పాలించవలెనంటే కొంతమంది ఆధారకులుండవలెను కదా! సమస్త పదార్థములను, సమస్త జీవులను, సమస్త నియమములను పాటింపచేసేది ఈ సృష్టియొక్క ఘనత. ఈ డిపార్ట్‌మెంటుకు ఒకరిని నియమిండింది దైవత్వము. అతని పేరే బ్రహ్మ. ఈ సృష్టి పాలన అతని అధీనములో ఉంటుంటాది. పోషకత్మవీ కావాలి. ఉత్పత్తి గావించినంత మాత్రమున దీనికి భద్రత ఉండదు. పోషించే అధికారి కూడా ఉండాలి. అతనినే విష్ణువు అన్నారు. ఐతే పోషకత్వము జరిగిన తర్వాత భిన్నమయ్యే పరిస్థితి కలుగదు. సృష్టి జరిగిన తర్వాత అంతమయ్యేది ఉంటుంది. ఈ అంత్యముయొక్క నియమమును గుర్తించి సరైన నియమములను పాటించి వారియొక్క శక్తిసామర్థ్యములు పురస్కరించుకొని దానిని లయము గావించు శక్తి ఒకటి ఉంటున్నాది. అదే ఈశ్వరత్వము. ఈ సృష్టిస్థితి,లయములందు భాగము వహించి, బాధ్యత వహించి అధికారమును వహించి జగత్తును పరిపాలించే శక్తులు ఈ మూడు. ఐతే ఈ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కేవలం పరిపాలకులు మాత్రమే. వీరందరిపై అధికార ఆధిపత్యము వహించినవాడు దేవుడు. వానినే భారతీయులు భగవంతుడు అని పిలుస్తూ వచ్చారు. అనేక మతములవారు అనేక పేర్లతో పిలుస్తూ వచ్చారు. ఈనాడు జగత్తులో గ్రంఈ అని ఉపయోగపెడుతూ ఉంటాం. ఈ మూడు ఆధిపత్యములు తన హస్తమునందుంచుకున్నవాడు భగవంతుడు. ఈ గాడ్ అనే పదమునకు మూడక్షరములుంటున్నాయి. G - generation, O - organisation, D - Destruction. ఈ మూడింటి సమ్మిళిత స్వరూపమే గాడ్. బ్రహ్మ దైవము, విష్ణువు దైవము, శివుడు దైవము అని అనుకుంటున్నాము, కాదు. వీరు ఒక్కొక్కరూ ఒక్కొక్క డిపార్టుమెంటుకు మాత్రమే అధిపతులు. అందరిపైన ఆధిపత్యము గలవాడు దైవము. ఈ దైవము అణుస్వరూపమై సర్వత్రా వ్యాపించి ఉన్నాడు.

సూక్ష్మమైనట్టి అణువున సూక్ష్మమగుచు
మేటి వస్తువునందున మేటియగుచు
అంతటను సర్వసాక్షియై అలరునట్టి
ఆత్మయే అణువు ఆత్మయే అణువు అగును.

ఇతని పేరే ఆత్మ. ఇట్టి ఆత్మ సర్వత్రా వ్యాపించి ఉంటున్నాది. ఇట్టి అణుస్వరూపమైన ఆత్మ యావత్ సృష్టినంతా పరిపాలన జరుపుచున్నాది, తగిన లక్ష్యముతో చూస్తూ ఉంటున్నాది. ఇతనే సాక్షీభూతుడు. లైట్లు వెలుగుతున్నాయి. కొంతమంది వింటున్నారు. కొంతమంది నిద్రిస్తున్నారు. కొంతమంది వెడుతున్నారు. కొంతమంది వస్తున్నారు. కొంతమంది ఎక్కడనో చూస్తున్నారు. ఎన్ని పనులు చేస్తున్నప్పటికిని పనులకు, లైటుకు సంబంధము లేదు. లైటు సాక్షీభూతము. అదేవిధముగా సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. సూర్యప్రకాశమును ఆధారము చేసుకొని అనేకమంది అనేక పనులు చేస్తున్నారు. మంచి పనులతో సూర్యునికి యేమీ ప్రకాశము అధికము కాలేదు. చెడ్డపనులతో సూర్యునికి యోమాత్రము అంధకారము ప్రవేశించలేదు. ఐతే తాను సాక్షీభూతుడుగా అందరికీ

వెలుగునందిస్తున్నాడు. సూర్యుడే లేకపోతే ఎవరి పనులు వారు చేయలేరు. కాబట్టి, పనులు చేయించే నిమిత్తమై సాక్షీభూతుడై ఉన్నాడుగాని ఫలనిమిత్తమై తాను సాక్షీభూతుడు కాదు. ఫలమును మాత్రము మనకు మనమే అనుభవించాలి. ఈ ఫలమును అనుభవించే నిమిత్తమై, ఈ ఫలమును దుర్బలముగా మార్చే నిమిత్తమై, దుష్టఫలములను సత్ఫలములుగా మార్చే నిమిత్తమై ఈ బ్రహ్మవిష్ణుమహేశ్వరులు సరైన మార్గమును అనుసరిస్తూ ఉంటారు. వీరిని సంతృప్తి పరచాలంటే మనము యేమి చేయాలి? అదియే ఈనాడు మనము చేసిన పని.

*శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనమ్*
*అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్.*

ఈనాడు ఆ ముగ్గురితో స్నేహము సంపాయించుకోవాలి. వారు మన స్నేహితులైనప్పుడు మన బాధలు ఎన్నైనా తీర్చుకోటానికి వీలవుతుంది. మినిష్టరు మన స్నేహితుడైనప్పుడు, మినిష్టరు మన బంధువైనప్పుడు మన బాధలను ఎన్నైనా మనం తీర్చుకోవచ్చు. అదేవిధముగా తెలిసో తెలియకో చేసిన కర్మలయొక్క ఫలితమును ఈ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల స్నేహము ద్వారా ఎంతైనా విజయాన్ని సాధించవచ్చు. బ్రహ్మ, విష&ణ, మహేశ్వరులను ప్రసన్నము గావించుకునే నిమిత్తము భగవన్నామ స్మరణ అత్యవసరము. భగవధ్యానము అత్యవసరము. ఇవన్నీ వారిని ప్రసన్నులను గావించుకునే నిమిత్తము ఏర్పడిన మార్గములే. ఐతే ఈ ప్రాకృతమైన మినిష్టర్సుకు, విశ్వవ్యాప్తమైన దైవత్వమునకు ఎందుకు ఈ పోలిక? ఎందుకు ఈ గుర్తులు. ఈ విశ్వమంతయూ అనేక గుర్తులతో ఏర్పడింది. మీకు తెలుసు బాగా. మనము ఎక్కడైనా ప్రయాణమై వెడుతుంటే రోడ్డు సర్కిల్‌లో పోలీసువారు నిల్చొని ఉంటారు. వారు ట్రాఫిక్‌ను కంట్రోలు చేస్తారు. కొన్ని సిగ్నల్సు కూడా ఇంటాయి. ఈ సిగ్నల్సు ఎందుకోసం ఉండాలి? లోక పరిపాలన నిమిత్తమై ఉంటుండాలి. లేకపోతే జగత్సంరక్షణ జరగదు.

సృష్టికర్త అయిన బ్రహ్మ కాలకారణకర్తవ్యములను పురస్కరించుకొని ఎవరికి ఏ జన్మములో చేసిన తత్ఫలితమో దానిని అనుసరించి వారివారి డిపార్టుమెంటు లోపల వారి స్థాయికి తగినట్టుగా నడుస్తూఉంటాడు. వారికి తగిన ప్రమోషన్లు అందిస్తూ ఉంటాడు. అంతేకాక కొన్ని డిపార్టుమెంట్సును మారుస్తూ ఉంటాడు. ఇదే సృష్టికర్త ప్రధాన కర్తవ్యము. ఈవిధమైన కర్తవ్యములను పురస్కరించుకొని బ్రహ్మతత్త్వమనేది వ్యాపించిపోయింది. బ్రహ్మ అనగా వ్యాపకమైనది. విష్ణువనగా యేమి అర్థము? అదికూడను సర్వవ్యాపకత్వమే. ఎక్కడ సృష్టి ఉందో అక్కడ రక్షణకూడా ఉంటున్నాది. కనుక, బ్రహ్మ ఉన్నచోట విష్ణువుకూడా ఉంటాడు. ఎక్కడ రక్షణ జరిగిందో అక్కడ శిక్షణ ఉంటున్నాది. ఆ శిక్షించే విధానములో ఈశ్వరత్వము ఉంటున్నాది. ఈ ముగ్గురూ కూడా తమతమ డిపార్టుమెంట్సునందున& నదోషములను, మంచిని సరైన రీతిలో ఉంచి భగవంతునికి అందించే విధానము. దైవత్వము ఎక్కడ? దైవత్వము సర్వత్రా ఉంటున్నాది. ఇట్టి రహస్యమును మనము గుర్తించుకొనలేక దైవమును అనేకవిధములుగా ప్రార్థిస్తుంటాము. ఇవి దైవ ప్రార్థనలు కాదు. ఇది పరిపాలకులను ప్రార్థించే విధానమే. ఈ పరిపాలకులు దీనియొక్క స్థితిగతులను పురస్కరించుకొని దైవమునకు రికమెండ్ చేస్తారు. దైవము నిరంతరము సాక్షీభూతుడు. అతనికి ఒక్క గుణము లేదు. ఒక రూపము లేదు. ఏ రూపమైనా ధరించవచ్చు. కాని, గుణరహితుడైన భగవంతుడు గుణములందుకూడా ఉంటున్నాడు. కుండ మట్టిలో పుట్టింది. మట్టికి ఆకారము లేదు. కాని, మట్టితో చేరిన కుండకు ఆకారముంది. మట్టిలో కుండ లేదు. కాని, కుండయందు మట్టి ఉన్నది. కాబట్టి, దైవత్వము సర్వత్రా ఉంటున్నాది. గుణము, నిర్గుణమునందుకూడా ఉంటున్నాది. దైవము ఏవిధంగా మీతో వస్తున్నాది? చిత్తము. చత్తమునే చిత్రగుప్తుడు అన్నారు. మనలో గుప్తముగా నున్న చిత్తమునే చిత్రగుప్తుడన్నారు. మనము చేసిన మంచిచెడ్డలన్నీ ఆ చిత్తములో హత్తుకొని పోతాయి. ఆ హత్తుకొన్న విషయములకు రూపములందిస్తూ తద్వారా ఫలితమును చేకూరుస్తున్నాడు. ఈవిధమైన ధర్మమును పరిపాలన చేస్తూ రావటం చేతనే భగవంతుని ధర్మస్వరూపుడన్నారు. బ్రహ్మ చేస్తున్న దానిలో దైవము కల్పించుకొనడు. రక్షణలో కల్పించుకొనడు. పోషణలో కల్పించుకొనడు. అలాంటి సాక్షీభూతుడు కనుకనే ఇతనిని ధర్మస్వరూపుడు, సాక్షిస్వరూపుడు అన్నారు. ఐతే యక్కడ యింకొక చిన్న రహస్యము గుర్తించాలి. సృష్టికి సంబధించిన విషయములో బ్రహ్మతో కొంతవరకు సంబంధబాంధవ్యము కలిగించుకోవాలి. రక్షణ నిమిత్తమై విష్ణువుతో మనము సంబంధము కలిగించుకోవాలి. లయము నిమిత్తమై శివునితో సంబంధబాంధవ్యము కలిగించుకోవాలి. ఐతే మన హృదయము దైవభావముతో పరిపూర్ణముగా, పరిపూర్ణమైన స్థితిలోపల నేరుగా దైవముతోనే సంబంధబాంధవ్యము కల్పించుకోవాలి. ఇదే శరణాగతి. దైవరహస్యములు చాలా విచిత్రముగా ఉంటాయి.

చిత్రంబులు త్రైలోక్యపవి
విత్రంబులు భవలతాల విత్రంబులు స
న్మిత్రంబులు మునిజనవన
చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్.

సామాన్యులకు అర్థము కాదు. ఎందుకు స్వామి యిట్లా చేస్తున్నాడే, యీవిధమైన బాధలకు గురైపోయాడు అని ఈరకంగా మాట్లాడుతుంటాం. భస్మాసురునకు వరమిచ్చాడు ఈశ్వరుడు. ఇచ్చిన తక్షణమే దానిని పొందిన భస్మాసురునకు కృతజ్ఞత

లేకపోయింది. ఇచ్చిన ఈశ్వరుని తలపైనే చేయి పెట్టటానికి పోయాడు. కాని, ఈశ్వరుని తత్త్వములోపల రక్షకత్వము లేదు. కనుక, ఈశ్వరుడు తిరిగి విష్ణువు దగ్గరకు పోయాడు. రక్షించే బాధ్యత అతనిదే. అక్కడ విష్ణువు రక్షించటానికి పూనుకున్నాడు. అక్కడకూడా ధర్మవిరుద్ధముగాని రక్షణ జరగాలి. విష్ణువు ఒక డ్రామా నటించాడు. ఏమిటి ఆ డ్రామా! చక్కని అందమైన స్త్రీ, మోహినిగా రూపొందాడు. ఈ మోహినిని చూసేసరికి భస్మాసురుని మనస్సు చలించింది. ఆ మోహిని వెంట పడ్డాడు. మోహిని చెప్పింది, ' నేను చేసిన రీతిగా నీవు చేసినప్పుడే నిన్ను నేను వరిస్తాను' అని చెప్పింది. 'ఏమైనా చేయటానికి సిద్ధమే' అన్నాడు. ఎందుకు? విచక్షణాజ్ఞానము లేదు. వివేకజ్ఞానము లేని భస్మాసురుడు. కృతజ్ఞత లేని భస్మాసురుడు. కృతఘ్నుడైన భస్మాసురుడు అన్నింటినీ అంగీకరించాడు. సరే. ఈ మోహిని ఆడింది. ఆమె ఆడినట్లుగా ఆడాడు. చేతులు తీసి యిట్లా పెట్టుకుంది తలపైన. తానూ పెట్టుకున్నాడు. భస్మమయ్యాడు. తన హస్తమే తనను భస్మము గావించింది. ఇక్కడ రక్షణకూడా ధర్మవిరుద్ధముగాని రీతిలో జరిగింది. కొన్నికొన్ని సందర్భములలో భగవంతుడు శాంతమును వహించి, ప్రసన్నుడై ఈ కాలకర్మకారణము కలిసి ి వచ్చేంతవరకు వేచి ఉంటాడు. అంతమాత్రముచేత భగవంతునకు శక్తి లేదని మనం భావించకూడదు. అంతమాత్రముచేత భగవంతుడు చేయలేకపోయాడని భావించరాదు. భగవంతుడు యేదైనా చేయవచ్చును. ఏమైనా చేయవచ్చని అన్నీ చేయటానికి వీలుకాదు. నియమానుసారంగా ఉంటుండాలి. తాను చేసి యితరులకు అందించాలి. భగవంతుడు డ్రిల్లు టీచరువలె తాను చేసి చూపిస్తూ ఉంటాడు. కనుకనే, 'నా జీవితమే నా సందేశము' అని.

నిన్ను శిక్షించేది భగవంతుని పని కాదు. హింసించేది భగవంతుని లక్షణము కాదు. శిక్ష, హింస నీ కర్మలయొక్క ఫలితమే. నీవు చేసేదానికి నీవే కర్త. తాను కర్మల ఫలితము నందించే భోక్త. కర్మఫలమునందించేవానికి ఏవిధమైన సంబంధము ఉండదు. పోస్టుమేన్ ఉంటాడు. అతడు ఒక జాబును ఒక ఇంటిలో యిస్తాడు. ఇంకొక జాబును వేరొక ఇంటిలో యిస్తాడు. మొదటి ఇంటిలోని వారు ఘొల్లున యేడుస్తారు. రెండవ ఇంటిలోని వారు ఫక్కున నవ్వుతారు. ఏడ్వటానికి, నవ్వటానికి పోస్టుమేన్ కారణము కాదు. జాబులోని విషయము దుఃఖానికి, ఆనందమునకు కారణము. ఎవరి ఎడ్రస్సుతో వచ్చిన దానిని వారికిచ్చాడు. అదేవిధముగా భగవంతుడు సాక్షీభూతుడు. ఎవరి ఫలితములు వారికి అందిస్తాడు. ఒకవేళ అది బాధాకరమైనప్పుడు ఆ భగవంతుని ప్రసన్నుని గావించుకునే రీతిగా మనము ప్రార్థించినప్పుడు తానే ఆ డిపార్టుమెంటుకు చెప్పి తప్పిస్తాడు. ఆ స్వతంత్రము భగవంతునికి ఉంటున్నది. సృష్టిస్థితిలయములు ఈ మూడూ బ్రహ్మవిష్ణుమహేశ్వరులు. నాల్గవది ఒకటి ఉంటున్నాది. తిరోధాయకము అన్నారు. అనగా ఈ మూడింటిపైన అధిపతిగా ఉంటున్నాడు. అతనే దైవము. ఒక చిన్న ఉదాహరణము. చిన్న సీసాలో మందు ఉంటున్నాది. దీనిపై 1932 అని వేసి ఉంటారు. అనగా ఆ మందు అంతవరకు పనిచేస్తుంది. ఈ ముందు మన యింటిలో 1945 వరకు ఉంది. మందు ఉంటున్నాదిగానీ ఎక్స్పైర్ అయింది. అనగా ఆ మందు పనిచేయదు. అదేవిధముగా భగవంతుడు నీ కర్మలు ఉండినప్పటికీ తాను పవర్ ఎక్స్పైర్ చేసే అధికారమున్నది. ఎలాంటి దాన్నైనా ఎక్స్పైర్ చేయగలడు. అదే దైవత్వముయొక్క దివ్యశక్తి. లేని దానిని సృష్టించ వచ్చును. సృష్టించిన దానిని పోషించ వచ్చును. పోషించిన దానిని లయము గావించవచ్చును. ఈ మూడింటికి అధికారము భగవంతునికి ఉన్నది. కనుకనే, generation, organisation, destruction ఈ మూడింటి అధికారము దైవత్వమే. ఇలాంటి దైవత్వమును మనం పొందే నిమిత్తమై శరణాగతి చేయాలి. శరణాగతి అయినప్పుడే దైవత్వమునకు నేరుగా సంబంధము యేర్పడుతుంది.

ఈ శరణాగతి కాకుండా ఉండినంత వరకు ఈ డిపార్టుమెంట్సుకి పోయిన కాలము వ్యర్థము. కాలమును వ్యర్థము చేయటం మంచిది కాదు. కాలము భగవత్స్వరూపము. కాలమై దైవస్వరూపము. కాలము కాయమును మింగుతుంది అన్నారు. అట్టి భగవంతునికి మనం శరణాగతి కావాలి. ఈ శరణాగతి అయినప్పుడు సమయసందర్భానుసారంగా , స్థాన బలిమి చేత, పదవీ బలముచేత, దురవస్థలకు గురౌతాడు. చిన్న ఉదాహరణ. రామలక్ష్మణులు సీతాన్వేషణ నిమిత్తమై దండకారణ్యములో ప్రయాణమై పోతున్నారు. అలసిపోయారు. ఒక చెట్టు క్రింద కూర్చున్నారు. కూర్చున్న లక్ష్మణుడు లేచి, 'అన్నా! నేను ఈ అవస్థలకు గురికాను. ఈ బాధలను సహించలేను. కాలమునకు భోజనముగాని, నీరుగాని చిక్కటం లేదు. ఆహారపానీయములు లేకుండా నా శరీరమును కృశింపచేసుకుంటున్నాను. నేను అయోధ్యకు వెడతాను. ఒక్క క్షణమైనా యిక్కడ ఉండను' అన్నాడు. ఈ దుర్భావములు అతనిలో ఆవిర్భవిస్తూ వచ్చాయి. రాముడు నవ్వాడు. 'సోదరా! మనము వెడదాము. తర్వాత మాట్లాడుదాము' అని చెప్పాఇు. పూర్వము రాముడే నా తండ్రి, రామ సన్నిధే నా పెన్నిధి, అయోధ్యలో నేనుండలేను, తల్లిదండ్రులనైనా త్యజిస్తానుగాని రాములను త్యజించి ఉండలేను అని అనుకున్న లక్ష్మణునికి ఈ దుర్బుద్ధి పుట్టటానికి కారణం ఏమిటి? దేహభ్రాంతి కల్గటానికి కారణం ఏమిటి? దేహాభిమానం అభివృద్ధి అవటానికి కారణం ఏమిటి? కొంచెం దూరం వెళ్లి చెట్టు క్రింద కూర్చున్నారు. తక్షణమే అతనికి పశ్చాత్తాపం వచ్చింది. రాముని కాళ్ళు గట్టిగా పట్టుకున్నాడు. 'అన్నా! నన్ను క్షమించు. ఎందుకు ఈ దుర్బుద్ధి ప్రవేశించిందో తెలియటం లేదు. కారణం ఏమిటి?' అని ప్రశ్నించేటప్పటికి రాముడు చెప్పాడు. 'లక్ష్మణా! ఆ ప్రదేశమంతయూ శూర్పణఖ సంచారము చేసిన ప్రదేశము. వృక్షము క్రింద విశ్రాంతి తీసుకునే స్థానము. ఆ దుర్గుణములు అక్కడి వాతావరణములో కలసిపోయి ఉన్నాయి. ప్రతి

శబ్దము విద్యుత్‌వైబ్రేషన్ గా నిల్చిపోయి ఉంటాయి. ఆ ప్రభావము నీలో ప్రవేశించి యిలాంటి దుర్బుద్ధి పుట్టింది. ఆ స్థానము వదలగానే సద్భావము వచ్చింది'. అదేవిధముగా కొన్నికొన్ని స్థానములందు, కొన్నికొన్ని సమయములందు మనం జాగ్రత్తగా ఉంటుండాలి. దుస్సంగమునకు దూరంగా వీండాలి. దురుభుద్దులు సంచరించే ప్రదేశమునుంచి మనం దూరం ఉండాలి. ఎందుకంటే మంచిగాని చెడ్డగాని ఒకవిధమైన వైబ్రేషన్ ఉంటుంది.

సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం।
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం నిశ్చల తత్త్వే జీవన్ముక్తిః॥

మంచివారితో మనం స్నేహం చేయాలి. మంచివారితో మనం సంబంధం యేర్పరుచుకోవాలి. మంచివారితోనే మన జీవితం అంతం గావించుకోవాలి. మన ప్రవర్తన సక్రమమైన రీతిగా మనం తీర్చి దిద్దుకున్నప్పుడు దైవానుగ్రహం డైరెక్టుగా మనకు వచ్చి చేరిపోతుంది. ఎక్కడ ఉన్నాడని అనుకుంటాము. ఏనాడూ దైవమా అని పిలవనివాడు కూడా దైవాన్ని స్మరిస్తాడు తెలియకుండా. మీకందరికీ తెలుసు. మన భారతదేశ ప్రధానమంత్రి నెహ్రూ ఉండేవాడు. ఆయనకు ఆధ్యాత్మికమంటే గిట్టదు. దైవమంటే అతనికి అర్థము కాదు. అతను పెరిగిన వాతావరణము అలాంటిది. ఒకానొక సమయంలో మధురకు వెళ్ళాడు. అక్కడున్న ఎం.పి.లు, ఎం.ఎల్.ఏ.లు అంతా కలసి మీనాక్షి దేవాలయానికి తీసుకు వెళ్లారు. ఎంత పెద్దవాడైనా వారి మాట వినక తప్పదు. వారి బలం కావాలి. ఇష్టము లేకపోయినా వారి ప్రోద్బలముతో దేవాలయములో ప్రవేశించాడు. ఈనాడు భారతీయుల బలహీనత యేమంటే దేవాలయము గూర్చి ఊరికే వర్ణించటం. ఆమె వక్షస్థలం పైనున్న పచ్చల పతకం కోట్లరూపాయలని చెప్పారు. చెవుల కమ్మలు చాలావిలువైనవి అన్నారు. 'ఈ విలురాళ్లు తీసుకుని విలువలేని రాయిని ఎందుకు అలంకరించారు?' అడిగాడు. అక్కడనుంచి వస్తున్నాడు. తలుపు చూడలేదు ఆయన. గడప తగిలింది. పడబోయాడు. 'oh! my God' అన్నాడు. ఏ గాడ్? మై గాడ్ అన్నాడు. అక్కడనే మనం చక్కగా విచారించాలి. ప్రతి ఒక్కరికి దైవము ఉన్నాడు. నా దేవుడని అంటుంటారు. అప్రయత్నంగా ఈ దైవత్వము మనలో ఆవిర్భవిస్తుంది. కారణం యేమిటి? ప్రతి మానవునియందు ఉన్నది దైవమే. ఆ దైవత్వము మనకు తెలియకుండానే వస్తుంది.

ఒక గొప్ప ఫండితుడుండేవాడు. ఈ పండితుడు గొప్పగా వేదములు, ఉపనిషత్తులు, పురాణములు చక్కగా వర్ణించి, వ్యాఖ్యానము గావించి అందరికీ అర్థమయ్యేలా చెప్పేవాడు. అతని వెంటనే అతని కుమారుడు వస్తున్నాడు. ప్రతి దినము వీరిని భోజనమునకు పిలిచేవారు. పండితులు భోజనము చేసేవారు. వారిన తీయేకులస్థులని అడగటానికి భయము వేసింది. ఒక పండితుడు భార్యతో, 'అతనిని మన ఇంటకి భోజనానికి పిలవాలి' అన్నాడు. మనకు ఒక బిడ్డ ఉంటున్నాది. పండితుని కుమారునికిచ్చి పెండ్లి చేస్తే ఎంత అదృష్టవంతులమో. సంబంధము మనము యేర్పరచుకోవాలి అనుకున్నారు. కాని, గోత్రం సరిపోతుందో లేదో అని సందేహిస్తూ వచ్చారు. భార్య, 'మీరు ఉండండి, నేను కనుక్కుంటాని' అంది. చక్కటి బొబ్బట్లు వేసింది. చక్కగా మంచి నేయి వేసి పండితుడు వచ్చేటప్పటికి వడ్డించింది ఆకులో. బొబ్బట్లు నేయి తింటే తమోగుణముతో కొంచెం మత్తు వచ్చింది అతనికి. 'స్వామీ! మీరు విశ్రాంతి తీసుకోండి' అని పరుపు వేసి పండుకోమన్నారు. ఆయన చక్కగా గురకతీసి నిద్రపోతున్నాడు. ఒక గరిట కాల్చింది ఈ యిల్లాలు. అరికాలుపై వాత పెట్టింది. వాత పెట్టేటప్పటికి అతనికి సహజంగా లోని భావం వెళ్ళి వచ్చింది. 'అల్లా' అన్నాడు. ఇతను మహమ్మదీయుడని అనుకున్నారంతా. చూచారా! కల్పితమైన దానిలో వచ్చేది ఒకటి, సహజమైన దానిలో వచ్చేది సత్యమే. మనలోనుంచి సహజమైనది రావాలంటే దైవత్వమే. మిగిలవన్నీ కల్పితములే. ఈనాడు కల్పితములోపల మన జీవితాన్నంతా కల్మషము చేస్తున్నాము. స్వభావము పైన ఆధారపడాలి. అదియే దైవత్వము. స్వ... భావము. ఆ ఆత్మభావము రావాలంటే ఆధ్యాత్మికము అత్యవసరం. ఆధ్యాత్మికమంటే ఏమిటి? జపము, భజన యివంతా కాదు. ఆధ్యాత్మికమనగా మానవుని యందు శేషించిన ఈ పశులక్షణములు వదలి దివ్యలక్షణాలు అభివృద్ధి పరచుకోటమే. ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశించినవారు పశుతత్త్వమును దూరం చేసుకోవాలి. దివ్యత్వమును పెంచుకోవాలి. అదే నిజమైన ఆధ్యాత్మికము. దినము మనము సాధనలు చేస్తున్నప్పటికీ మనలోనున్న పశులక్షణములు పోవటం లేదు. ఆధఆ్యత్మికము ఎట్లా అవుతుంది? పరులను దూషించటము, పరులను నిందించటము, పరులను హాస్యాస్పదము గావించటము యీవిధమైన దాంట్లో ఉండటం చేత పశులక్షణాలుగా ఉంటున్నాయి. అందరియందు దైవత్వముంటున్నాది. అందరిని మనం గౌరవించాలి. అందరిని మనం ప్రేమించాలి. మన కర్తవ్యం మనం నిర్వర్తించాలి. ఇదే మానవుని ప్రధానమైన ధర్మము.

శరణాగతిని సాధించినవాడే లక్ష్మణుడు. 'ఓ రామా! నా సర్వస్వమూ నీవే. నేను నీయొక్క శరణాగతుడను. నీ చేతిలో పనిముట్టును. నీ ఆజ్ఞకు సిద్ధమైనవాడను' అని శరణాగతి చేశాడు. అరణ్యమునకు వెళ్ళిన తరువాత, రాముడు అలసిపోయి లక్ష్మణునితో ఒక పర్ణశాలను నిర్మించమన్నాడు. 'ఎక్కడ?' అడిగాడు. 'నీకు యిష్టము వచ్చిన చోట నిర్మించు' అన్నాడు. కుమిలిపోయాడు లక్ష్మణుడు. 'ఇంత కఠినమైన మాట వినవలసి వచ్చెనా. ఇది నా దురదృష్టము. కర్మ ఫలము' అని విచారిస్తూ కూర్చున్నాడు. రాముడు దగ్గరకు వెళ్ళి, 'ఎందుకింత ఆపోహ పడుతున్నావు? నేను అనరాని మాటలు అనలేదే!' అని అడిగితే చెప్పాడు. 'నేను యేనాడో శరణాగతుడనైనాను. నీకు యిష్టము వచ్చిన చోట ఒక పర్ణశాల నిర్మించ మన్నావు. అంతకంటె కఠినము కావలెనా!

నాకు యిష్టము వుంటున్నదా? నాకు యిష్టమే వుటుంటే శరణాగతి అర్థమేముంటున్నాది? నీ యిష్టమే నా యిష్టము'. అప్పుడు ఈ సత్యము గుర్తించి రాముడు, ' నీవు బాధ పడకు. ఈ స్థానంలో పర్ణశాల నిర్మించు' అన్నాడు. అంత సూక్ష్మబుద్ధి కలవాడు లక్ష్మణుడు. కనుకనే, త్యాగరాజు కష్టములు భరించుకొనలేక, బాధలు భరించుకొనలేక రాములను నిందిస్తూ వచ్చాడు. 'నేను సర్వమూ రాములే అని విశ్వసించాను. కానీ రామా! నన్ను బాధలనుండి తప్పించలేక పోయవు కదా! నాలో భక్తి లేదా, నీలో శక్తి లేదా! ఏదో ఒకటి నిర్ణయము చేసుకోవాలనుకున్నాడు. 'నీలో శక్తి లేకపోవటం చేతనే నా బాధలు తీర్చలేకపోతున్నావు' అన్నాడు. తరువాత యోచించుకున్నాడు. ఛీ!ఛీ!ఛీ! ఇది నా దోషమే. నీలో శక్తి లేకపోతే,

కపి వారధి దాటునా కలికి రోటగట్టునా
లక్ష్మిదేవి వలచునా! లక్ష్మణుండు కొలచునా!
సూక్ష్మబుద్ధిగల భరతుడు చూచిచూచి మ్రొక్కునా!
అబ్బ రామభక్తి ఎంతో గొప్పరా!!!!

బాధ పడ్డాడు. 'స్వామీ! నీ శక్తి ఎంతో గొప్పది. నీ శక్తి యిట్టిది అట్టిది అని చెప్పటానికి వీలుకాదు. అదేవిధముగా సాయి శక్తి యిట్టిది అట్టిది అని ఎవరు చెప్పగలరు! అర్జంటైనానుంచి వస్తున్నారు. ఆస్ట్రేలియానుంచి వస్తున్నారు. వీరందరూ తెలివి లేనివారా! ధనకనకవస్తువాహనాదులు లేనివారా! వారందరూ రావటంలో ఏమి అర్థము? ఎవరు ఆహ్వానం చేస్తున్నారు? ఈ ఒక్క దానిలో స్వామియొక్క తత్త్వము గుర్తించటానికి వీలవుతుంది. కనుక, దైవత్వమును గుర్తించాలంటే మనము శాస్త్రములు చదవనక్కరలేదు. ఉపనిషత్తులు చదవనక్కరలేదు. దృశ్యకల్పితమైన దీంట్లోనే అర్థము చేసుకోవచ్చు. దైవత్వము యిట్టిది అట్టిది అని ఎవరూ వర్ణించటానికి వీలుకాదు. అది వర్ణనాతీతమైనది. అట్టి దైవత్వమును నమ్మి మన కష్టములయందుగాని, సుఖములందుగాని దైవవిశ్వాసమును కోల్పోకుండా మనము సాధించటానికి ప్రయత్నించాలి. అదే అప్పుడప్పుడు చెబుతుంటాను.

పట్టినదేదియో పట్టనే పట్టితి
పట్టునెగ్గెడుదాక అట్టెయుండు
కోరినదేదియో కోరనే కోరితి
కోర్కె చెల్లెడుదాక కొలచియుండు
అడిగినదేదియో అడగనే అడిగితి
వడిగినదిడుదాక విడువకుండు
తలచినదేదియో తలచనే తలచితి
తలపు తీరెడుదాక తరలకుండు
పోరు పడలేక తానైన బ్రోవవలయు
ఒడలు తెలియక నీవైన ఉడుగవలయు
అంతియేగాని మధ్యలో ఆపివేసి
తిరిగి పోవుట భక్తుని దీక్షకాదు.

తానైనా అనుగ్రహించాలి. నీవైనా దేహమును మరచిపోవాలి. అంతవరకు వదలకూడదు. కానీ, ఈనాడు అట్టి పట్టుదల లేకుండా పోయింది. అట్టి ప్రజ్ఞ లేకుండా ఉంటున్నాది. పార్ట్‌టైమ్ డివోషన్‌గా జరిగిపోతున్నాది. అలాంటి దైవత్వమును చక్కగా మనము దృఢవిశ్వాసముతో పట్టాలి. ఎలాంటిదానికి మనము యేమాత్రమూ చెలించకూడదు. చలించని దృష్టిని, భ్రమించని మనస్సును మనం అభివృద్ధి పరచుకోవాలి. ఈ విశ్వాసము ఉండినప్పుడే నీకు తగిన శక్తి లభిస్తుంది. రాత్రంతా భజన చేశారు. ఇది అఖండ భజన అనుకుంటున్నాము. కాదు ఇది ఖండ భజన. ఎక్కడ ప్రారంబమైనదో అక్కడ చేరితే అది పూర్ణవృత్తం. కాని, ఇక్కడ ప్రారంభమై యిక్కడ పోతే అది అర్థవృత్తము. ఇది పార్ట్‌టైమ్ డివోషన్. నిరంతరము సర్వదా సర్వకాలేషు సర్వత్ర హరిచింతనం. ఏ పనైనా చేయి, నీవు భగత్కార్యముగా భావించు. ఏ మాటయైనా మాట్లాడు, భగవత్ మాటగా మాట్లాడు. నీ ఆఫీసు పని చేయి, భగవత్ పనిగా భావించు. అన్నింటియందు భగవద్భావము పెట్టుకో. అదే అఖండ భజన. నిరంతరము, సమయము చిక్కినప్పుడంతా భగవచ్చింతన చేయటానికి ప్రారంభించండి. దైవాన్ని మరచితే మనకు జగత్తులో ఏదీ లేదు. సర్వమూ దైవమే. నీవూ దైవమే! ఇలాంటి స్థితిని సంపాయించకోటానికి ప్రయత్నించాలి.

(1995 ఫిబ్రవరి 28వతేదీ శివరాత్రి మరునాడుదయము 6గంటలకు పూర్ణచంద్రలో భగవాన్ బాబావరి దివ్యోపన్యాసం)